

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0 కనిష్ఠం : 28.0
తణుకు : 34.0 - 27.0

ఇంటింటా ఓటరు సర్వే



భీమవరంలో సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

అక్టోబరు 18 వరకు చేయనున్న బీఎల్‌వోలు

వచ్చేఏడాది జనవరి 6న సంక్షిప్త ఓటర్ తుది జాబితా విడుదల

భీమవరం టౌన్, ఆగస్టు 20 : రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణకు సంబంధించి 20వ తేదీ నుంచి సర్వే ప్రారంభమైంది. ఇందులో భాగంగా జిల్లాలో 1461 మంది బీఎల్‌వోలు సర్వేను ప్రారంభించారు. ఓటరు జాబితా ఆధారంగా ఇంటింటికి వెళ్ళి పరిశీలన చేసి అర్హులు ఎవరైనా ఉంటే కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈప్రక్రియ అక్టోబరు 18వ తేదీ వరకు కొనసాగుతుంది. అలాగే జాబితాలో చేర్పులు, మార్పులతోపాటు అనర్హులు ఉంటే వారిని కూడా తొలగించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నారు.

పర్యవేక్షణకు అధికారులు

ప్రస్తుతం జరుగుతున్న సంక్షిప్త సర్వే పరిశీలనకు అధికారులను నియమించారు. ఏడుగురు ఈఆర్వోలు, ఏఆర్వోలు 44 మంది ఉన్నారు. బీఎల్‌వోలు చేపట్టే సర్వేను పర్యవేక్షించటంతోపాటు ఇబ్బందులు రాకుండా పర్యవేక్షిస్తారు.

పోలింగ్ స్టేషన్‌ల వద్ద ప్రత్యేక శిబిరాలు

ఓటర్ల జాబిత సవరణలో భాగంగా నవంబరు 9,10, 23,24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద బీఎల్‌వోలతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కూడా అర్హులైన వారు దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. ఓట్ల తొలగింపు, అభ్యంతరాలు తదితర అంశాలపై దరఖాస్తులు చేసుకునే అవకాశం ఉంది. నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 24వ తేదీలోగా వచ్చిన దరఖాస్తులకు సంబంధించి పరిశీలన చేస్తారు.

జనవరి 6న తుది ఓటర్ల జాబితా

వచ్చిన దరఖాస్తులకు సంబంధించి ఫిర్యాదులతో సహ పూర్తిగా పరిశీలన చేసిన అనంతరం వచ్చే ఏడాది జనవరి 1 వ తేదీన అధికారులు నిబంధనల మేరకు జాబితా సిద్ధం అయిందో లేదో పరిశీలన చేస్తారు. ఎన్నికల కమిషన్ సూచించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కా తుది ఓటర్ల జాబితాను అధికారులు విడుదల చేస్తారు. దీంతో సంక్షిప్త సవరణ ఓటర్ల జాబిత పక్రియ ముగుస్తుంది.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాకు కసరత్తు

సెప్టెంబరు 3లోగా దరఖాస్తు చేయాలి

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 4500 మంది ఉపాధ్యాయులు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పూర్వ ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలో ఓటర్ల జాబితాకు కసరత్తు చేస్తున్నారు. అర్హులైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు సెప్టెంబరు 3లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఎన్నికల సంఘం ఇప్పటికే ఉపాధ్యాయ ఓటర్ల జాబితా కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ మేరకు ఓటర్ల జాబితాను సిద్ధం చేయనున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదైన తర్వాత ఓటు వేస్తారు. మళ్లీ ఎన్నికలు వచ్చినప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పాత జాబితాను పరిగణలోకి తీసుకోరు. కొత్తగా జాబితాను సిద్ధం చేస్తారు. జిల్లాలో దరఖాస్తు చేసుకోవడానికి ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే బోధన సిబ్బంది ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి అర్హులు. ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే బోధన సిబ్బందికి మాత్రమే ఉపాధ్యాయ ఎమ్మెల్సీల్లో ఓటు హక్కు కల్పిస్తారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 4500 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కుకు అర్హులుగా అంచనా వేస్తున్నారు. అదే కళాశాలలు, ప్రైవేటు విద్యా సంస్థల్లో మరో 3వేల మంది ఉపాధ్యాయులుంటారు. వారంతా సెప్టెంబరు 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం ఓటరు జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది జబితాను ప్రకటిస్తారు.

రేవు బకాయి వసూలుకు ఆర్‌ఆర్ యాక్టు

నరసాపురం, ఆగస్టు 20: ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై 2 వరకు మాధవాయిపాలెం రేవు కాంట్రాక్ట్ నిర్వహించిన రెడ్డప్ప ధవేజీ మండల పరిషత్‌కు రూ.53 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీని వసూలుకు అప్పటి ఎంపీడీవో రమణరావు ఎనిమిదిసార్లు నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. ఈ నేపథ్యంలో ఎంపీడీవో ఆత్మహత్య కలకలం రేపింది. అయిన ప్పటికీ నేటికి బాకీ వసూలు కాలేదు. ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించిన మండల పరిషత్ అధికారులు తాజాగా ఆర్‌ఆర్ యాక్టు(రెవెన్యూ రికవరీ యాక్టు) ప్రకారం బకాయిదారుడు నుంచి వసూలుకు జిల్లా కలెక్టర్‌ను అనుమతి కోరారు. రాగానే ఈ చట్టాన్ని ప్రయోగించి పెండింగ్ బకాయిని వసూలు చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో వీరభద్రరావు చెప్పారు.

నేడు భారత్ బంద్

మొగల్తూరు/ఆచంట/నరసాపురం, ఆగస్టు 20 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును నిరశిస్తూ మాలమహానాడు, ఇతర సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చేపట్టనున్న భారత్ బంద్‌కు సహకరించాలని పీవీ రాష్ట్ర మాల మహానాడు మండల అధ్యక్షుడు ఇంజేటి కుమారస్వామి కోరారు. మొగల్తూరు రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ నిరంజన్‌కు ఈ మేరకు వినతిపత్రం అందించారు. విద్యా, వాణిజ్య సంస్థలు, ఉద్యోగులు తమ హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి మద్దతు పలకాలని కోరారు. ఆచంట మండలం కొడమంచిలిలో అంబేద్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాట్లాడుతూ బంద్‌కు సహకరించాలని కోరారు. నరసాపురంలో బంద్ విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సోడదాసి శ్రీధర్, కాకిలేటి ఆనంద్, విజయభాస్కర్, బత్తుల శ్రీను పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

ప్రజలతో పోలీసులు మమేకం కావాలి: ఎస్పీ

గంజాయి, సారాపై ప్రత్యేక నిఘా

భీమవరం క్రైం, ఆగస్టు 20 : అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి కేంద్రీకరించి, వేగవంతంగా దర్యాప్తు పూర్తి చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ముఖ్యమైన నేరాలకు సంబంధించిన కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు తప్పనిసరిగా గ్రామ సందర్శనలు చేయాలని, ప్రజలతో మమేకమైన గ్రామంలో సమస్యలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి, ప్రాథమిక స్థాయిలోనే ఆయా వ్యక్తులను ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. గంజాయి నియంత్రణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితుల నుంచి వారికి అమ్మిన, సరఫరా చేసిన వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, ఆయా కేసుల్లో వారిని నిందితులుగా చేర్చాలన్నారు. గంజాయి కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో పూర్తి స్థాయిలో అక్రమరవాణాను అరికట్టాలని పేర్కొన్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అక్రమ మద్యం, సారా, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎస్పీ సూచించారు. జైలు నుంచి రిలీజ్ అయిన ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచి వారి కదలికలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ నేరాలపై ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

పంచాయతీల నిధులు పక్కదారి



పాలమూరు గ్రామ సచివాలయం

వైసీపీ పాలనలో వారి సర్పంచ్‌ల అజమాయిషీల్లో నిధుల వినియోగంపై నిబంధనలు తుంగలోకి తొక్కి దుర్వినియోగం చేసినా అప్పటి పంచాయతీ కార్యదర్శులు కిమ్మనకుండా వారికి అనుకూలంగా పనిచేసి స్వామి భక్తిని చాటుకున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో పాలన మారటంతోపాటు, కొత్త కార్యదర్శులు బాధ్యలు చేపట్టడంతో ప్రస్తుత వైసీపీ సర్పంచ్‌లు బాగోతాలు ఒక్కొటిగా బయటపడుతున్నాయి. దీంతో సంబంధిత అధికారులు కంగారు పడుతున్నారు.

ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో కిందిస్థాయి అధికారులు.. ప్రభుత్వం మారటంతో ఒక్కొక్కటిగా వెలుగులోకి..

పెనుమంట్ర, ఆగస్టు 20 :పెనుమంట్ర మండలంలోని పలు పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, చెరువులపాటలకు సంబంధించిన నిధులు జమ చెయ్యకపోవటం, బ్లీచింగ్, వీధిదీపాలపేరిట లక్షలాది రూపాయలు పక్కదారి పట్టిన సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. పెనుమంట్ర గరువు పంచాయతీలో పంచాయతీ చెరువును ప్రజాపత్రినిధి పాడుకుని ఇప్పటి వరకు ఒక్కరూపాయి కూడా పంచాయతీకి జమ చెయ్యలేదని ప్రచారం జరుగుతోంది. రికార్డులు కూడా మాయం కావటంతో అనుమాలనాలకు తావు ఇస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ఈవో బదిలీపై వెళ్ళిపోవటంతో అక్కడకు కొత్తగావచ్చిన ఈవో రికార్డులు స్వాధీనం చేసుకోగా చెరువు పాటలకు సంబంధించిన రికార్డులేకపోవటం గత పాటలకు సంబంధించిన సొమ్ము నమోదులేకపోవటంతో కొంతమంది ఈవోపీఆర్‌డీకి ఫిర్యాదు చెయ్యటంతో విషయం బయటకు పొక్కింది. సంబంధిత అధికారి నేరుగా ఆ ప్రజాప్రతినిధితో మాట్లాడితే కొద్దిరోజుల్లో సొమ్ము జమ చేస్తామని చెప్పినట్లు సమాచారం. అయితే ఈ సంఘటనపై ఈవోపీఆర్‌డీ రాంప్రసాద్‌ను వివరణ కోరగా పంచాయతీలో రికార్డు కనిపించకపోవటం వాస్తమేనని, అయితే గ్రామ పంచాయతీలో వెతకగా పాత రికార్డుల్లో వేలంపాటకు సంబంధించిన రికార్డు పుస్తకం దొరికిందని తెలిపారు. చెరువును పాడుకున్న పాటదారులకు నోటీసులు జారీ చేస్తున్నామని ఆయన వివరించారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసినా..

మండలంలో మేజర్ పంచాయతీల్లో పొలమూరు ఒకటి. ఈ పంచాయతీలో ప్రభుత్వ సొమ్ము వార్డుసభ్యుని ఖాతాలోకి, పంచాయతీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసున్న వ్యక్తి ఖాతాలోకి, మండలంలోని సత్యవరం గ్రామ పంచాయతీ ఖాతాలోకి సొమ్ము జమచేసేసి వాడేశారు. ఇలా సుమారు 70 లక్షల రూపాయలు దుర్వినియోగం అయ్యాయని గతంలో జనసేన వార్డు సభ్యుడు తోరం వెంకన్నబాబు అప్పటి కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. అయినా ఎటువంటి విచారణ జరగలేదు. చర్యలు లేవు.

రసీదులు లేవు.. కాని బిల్లులు చెల్లించాలట..

మార్టేరుకు చెందిన ఒక కాంట్రాక్టర్ తాను పొలమూరు పంచాయతీకి బ్లీచింగ్, ముగ్గు, వీధిదీపాలను సరఫరా చేశామని అందుకు రూ.18 లక్షలు రావాలంటూ పంచాయతీ చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నాడు. సరుకు ఇచ్చినట్లుగా రశీదులుగానీ, సంబంధిత అధికారి పరిశీలన చేసి సరుకును స్వీకరించినట్లుగానీ రశీదులు చూపించాలని ప్రస్తుత పాలకవర్గ సభ్యులు ప్రశ్నిస్తే మాత్రం అవేమిలేవు. బిల్లుమాత్రం రూ.18 లక్షలు ఇవ్వాలని కాంట్రాక్టర్ అడగటం విశేషం. అంతేకాకుండా చాలా వరకు ఈ పంచాయతీలో విచారణ చేస్తే విస్తుపోయే సంఘటనలు వెలుగుచూసే అవకాశంఉందని గ్రామంలో చర్చించుకుంటున్నారు.

పాత ఈవో ఇంట్లో రికార్డులు ఉన్నాయి

పొలమూరు గ్రామానికి చెందిన కొన్ని రికార్డులు గతంలో ఇక్కడ పనిచేసిన ఈవో రామాంజనేయులు ఇంట్లో ఉన్నాయని, ఈ విషయంపై ఉన్నతాధికారి దృష్టికి తీసుకువెళ్తున్నామని ఈవోపీఆర్డీ రాంప్రసాద్ చెప్పారు. ఆయన సెల్ ఫోన్ స్విచ్‌ఆఫ్‌లో ఉండటంతో ఆయన ఎక్కడ ఉంది సమాచారం తెలియటంలేదన్నారు. ఆయన పైచర్యలు తీసుకోవాలిన ఉన్నతాధికారులకు తెలిపామన్నారు.

రోగుల నుంచి ఫిర్యాదులొస్తే సహించం: కలెక్టర్



తణుకు ఆస్పత్రి ప్రసూతి వార్డులో కలెక్టర్

తణుకు/అత్తిలి, ఆగస్టు 20: పేదలకు మెరుగైన వైద్యం అందిచడంలో ప్రభుత్వ వైద్యులు ముందు వరుసలో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం తణుకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసూతి వార్డులో గర్భిణులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రసవాలు ఎలా జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. మందుల విభాగాన్ని పరిశీలించారు. గడువు ముగిసిన మందులు సంబంధిత రిజిష్టర్‌లో నమోదుచేసి, ఆమందులను విడిగా భద్రపర్చాలన్నారు. ఎప్పటికపుడు మందుల తేదీలను పరిశీలించుకోవాలని చెప్పారు. ఆసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు జరిగేలా, అందులో సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వివరించారు. ఆసుపత్రి తనిఖీల్లో వైద్య సేవల్లో లోపాలు కనిపించినా, రోగులు నుంచి ఫిర్యాదులు వచ్చినా సంబందిత వైద్యాధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ బి.వి.రమణ, డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సౌకర్యాలు కల్పించాలి

విద్యార్థులకు ఉన్నతంగా విద్యను అభ్యసించేందుకు అనువైన వాతావరణాన్ని వసతి గృహాల్లో కల్పించాలని జిల్లా కలెక్టర్ చదవలవాడ నాగరాణి అదికారులను ఆదేశించారు. మంగళవారం సాంఘిక బాలికల వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతిపై ఆరా తీశారు. అనంతరం వేల్పూరులో ఏర్పాటు చేయబోయే నీటి శుద్ధి ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించారు. అలాగే అత్తిలిలో సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ భోజనం చేశారు.

జగనన్న ఇళ్లకు దారేది?

రహదారులు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు... వర్షం వస్తే చెరువులే..

ఆంధ్రజ్యోతి పరిశీలన

7

ముగిసిన శ్రీవారి పవిత్రోత్సవాలు

- నేటి నుంచి ఆర్జిత సేవల పునరుద్ధరణ



ద్వారకా తిరుమల, ఆగస్టు 20 : చిన్న తిరుమలేశుని ఆలయంలో జరుగుతున్న స్వామి వారి దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం ఉదయం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి, తెలియక దొర్లిన తప్పుల ప్రాయఃచిత్తము నిమిత్తం నిర్వహించిన ఈ ఉత్సవాలు నాల్గురోజులపాటు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో పవిత్రావరోహణ, శ్రీమహాపూర్ణాహుతి హోమాన్ని, అనంతరం శ్రీమహదాశీర్వచనాన్ని ఆలయ అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీవారి మూలవిరాట్, అలివేలు మంగమ్మ, ఆండాళ్ అమ్మవార్ల, ఉత్సవమూర్తులపై ఉంచిన దివ్యపవిత్రాలను అర్చకులు వేదమంత్రోచ్ఛరణల నడుమ తొలగించారు. అనంతరం వివిధ దినుసులతో శ్రీమహాపూర్ణాహుతి హోమాన్ని ఆలయ అర్చకులు నేత్రపర్వంగా జరిపారు.

పవిత్రోత్సవాల సందర్భంగా నాలుగు రోజులుగా నిలిచిన ఆర్జిత సేవలు, నిత్యార్జిత కల్యాణాలు బుధవారం నుంచి పునరుద్ధరిస్తామని ఆలయ ఈవో త్రినాథరావు తెలిపారు.

పల్లెకు పండగొచ్చింది!

- నియోజకవర్గానికి రూ.10 కోట్లు
- ఉపాధి మ్యాచింగ్ గ్రాంట్‌లతో గ్రామాల్లో కళ
- 23న గ్రామ సభల్లో అభివృద్ధి ప్రణాళికలు



తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 20: ఐదేళ్లపాటు ఆదరణకు నోచుకోని పల్లెలకు పండగొచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రిగా ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకుని శ్రద్ధ వహించడంతో పల్లెలు ఊపిరి పీల్చుకున్నాయి. మరో పక్క ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలతో ఎన్నికైన సర్పంచ్‌ల అధికారాలు, విధులను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేయగా కూటమి సర్కార్ రాకతో వారికి కొండంత ధైర్యం వచ్చింది. తాజాగా నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెట్టనున్నది. ఈ నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనుల కోసం గ్రామసభల్లో ప్రణాళికలు చేయనున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన నిధులను సచివాలయాలు, ఆర్బీకేలకు కేటాయించి రోడ్ల నిర్మాణం గాలికి వదలడంతో గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. మురుగు డ్రెయిన్‌లేక తీవ్ర ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆ పనులు చేపట్టేందుకు ఎమ్మెల్యేలు కృతనిశ్చయంతో ఉన్నారు. జిల్లాలోని 7 నియోజకవర్గాల్లోని 409 గ్రామ పంచాయతీలకు ఈ నిధులతో ఊతం రానుంది.

గ్రామాభివృద్ధికి గ్రామసభల్లో ప్రణాళిక

ఐదేళ్ల పాటు గ్రామాల్లో రోడ్లు, డ్రెయిన్‌లు, పారిశుధ్యంలో నిర్వీర్యం చేయగా ఆ సమస్యలు పరిష్కరిస్తూ గ్రామాలకు అభివృద్ధి పనులు చేసేందుకు ఇప్పటికే ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ప్రణాళికలు వేసుకోగా ఆ ప్రణాళికలకు కార్యరూపం దాల్చే విధంగా సభల్లో తిర్మానాలు చేసేందుకు ఈనెల 23న జిల్లా వ్యాప్తంగా 409 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

ప్రణాళికాబద్ధంగా ఉపాధి హామీ మ్యాచింగ్ గ్రాంట్‌లను

ఇప్పటికే మ్యాచింగ్ గ్రాంట్‌లతో...

ఉపయోగించడంలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఆ నిధులను సద్వినియోగం చేసేందుకు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. ఒక్క తాడేపల్లిగూడెం నియోజకవర్గంలోనే రూ.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. అదే మాదిరిగా గ్రామాల్లో ఉపాధినిధులతో జిల్లాలోని గ్రామపంచాయతీల్లో పనులు ప్రారంభించారు.

పంద్రాగస్టుతో నిధులు విడుదల ప్రారంభం..

గ్రామాల్లో కనీసం బ్లీచింగ్ కొనుగోలు చేసేందుకే నిధులు లేవని గుర్తించిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవణ్ కళ్యాణ్ స్వాతంత్ర్య వేడుకలకు నిధులు విడుదల చేయడంతో గ్రామాలకు ఉత్సాహం పెరిగింది. మేజర్ పంచాయతీలకు రూ.25వేలు, మైనర్ పంచాయతీలకు రూ.10వేలు ఇచ్చారు.. దీంతో సర్పంచ్‌లకు, నాయకులకు గ్రామాల అభివృద్ధిపై భరోసా కలిగింది.

సర్పంచ్‌లకు పెరిగిన గౌరవం..

ప్రజల చేత, ప్రజల కోసం, ప్రజల వలన ఎన్నికైన సర్పంచ్‌లను గత జగన్ సర్కార్ నిర్లక్ష్యం చేసింది. వలంటీర్‌లను తీసుకొచ్చి సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మార్చారు. దీంతో ప్రజాస్వామ్యం కుంటుపడింది. కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో సర్పంచ్‌లకు గౌరవం పెరిగింది.

పంచాయతీల్లో కొత్త పాలన..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే అన్ని శాఖల్లో ప్రక్షాళన చేపట్టిన పాలకులు పంచాయతీ పాలనలో తమ మార్కు చూపించేందుకు కార్యదర్శులకు పదోన్నతులు కల్పించారు. దీంతో ఇప్పటి వరకూ పదోన్నతుల కోసం ఎదురుచూసిన గ్రేడ్ 4 కార్యదర్శులకు గ్రేడ్ 2 పదోన్నతులు కల్పించారు. దీంతో గ్రామాల్లో కొత్త అధికారులు కొలువయ్యారు. వారితోపాటు ఐదేళ్ల పాటు సుదీర్ఘంగా పంచాయతీల్లో పనిచేసిన కార్యదర్శులు తప్పకుండా కదలాలని బదిలీలు ఇవ్వడంతో ఆ కార్యదర్శులు కూడా బదిలీపై వెళ్లి గ్రామాల్లో కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించారు.


ద్వారకాతిరుమలలో కల్యాణ మండపం

అమ్మో..22వ తారీఖా..!

కల్యాణ మండపాలు, సత్రాలు ఫుల్..
పురోహితులు, భజంత్రీలు, కేటరింగ్ అందరికీ డిమాండ్
గురు, శుక్రవారాల్లో మంచి ముహూర్తాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 20: అమ్మో.. 22వ తారీఖా.. అసలు ఖాళీ లేదు.. కల్యాణ మండపాల యజమానులు, పురోహితులు, బాజా భజంత్రీలు, కేటరింగ్, పెళ్లి సామగ్రి సప్లై చేసేవారి నోట వినిపిస్తున్న మాట ఇదే.. ఆ రోజు మావల్ల కాదంటూ చేతులెత్తేస్తున్నారు. ఈనెల 22న బలమైన ముహూర్తం ఉంది. ఆరోజు జిల్లా వ్యాప్తంగా వేలాది పెళ్లిళ్లు జరుగుతాయని పురోహితులు చెబుతున్నారు. గురు, శుక్ర, శనివారాల్లో మంచి ముహూర్తాలుండటంతో వందలాది పెళ్లిళ్లకు ద్వారకాతిరుమల క్షేత్రం వేదికగా మారనుంది. ఈ క్రమంలో గురువారం రాత్రి గం. 10-30, తెల్లవారుజామున గం.2.47ని.లకు, 3.43, ని.లకు మంచి ముహూర్తాలు ఉన్నట్లు పండితులు గోవిందవరుల వెంకట రమణమూర్తి శర్మ తెలిపారు. అలాగే శుక్రవారం రాత్రి రేవతి, అశ్వని నక్షత్రాల్లో 10.24 నిమిషాలకు, తెల్లవారు జామున 3.43 ని.లకు మంచి ముహూర్తాలు ఉన్నాయి. దీంతో క్షేత్రంలో అన్ని కల్యాణ మండపాలు, రూములు, సత్రాలు నెలక్రితమే బుక్ అయిపోయాయి. గురువారం రాత్రి పెద్ద ముహూర్తం కావడంతో ఆలయ పరిసరాల్లో భారీగా పెళ్లిళ్లు జరుగనున్నాయి.

ఈ ముహూర్తాలు అత్యంత బలమైనవి



ఈనెల 22వ తేదీన ఉన్న మూడు ముహూర్తాలు అత్యంత బలమైనవి. ఉత్తరాభాద్ర, రేవతి నక్షత్రాలు ఉండటం వల్ల ఆయా ముహూర్తాల్లో ఎన్నో జంటలు మూడుముళ్ల బంధంతో ఒక్కటి కానున్నారు. ఈ మాసంలో ఈనెల 28న ముహూర్తం ఉంది. తర్వాత మరో నెల వరకూ ముహూర్తాలు లేవు.

గోవిందవరుల వెంకట రమణమూర్తి శర్మ, ద్వారకాతిరుమల

11 మంది ఎస్‌ఐలు, ఇద్దరు సీఐల బదిలీ

ఏలూరు క్రైం, ఆగస్టు 20 :జిల్లాలో పనిచేస్తున్న ఎస్‌ఐలలో 11 మందిని పరిపాలనా సౌలభ్యంలో భాగంగా బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. చేబ్రోలు ఎస్‌ఐ ఆకుల మణికుమార్‌ను గణపవరం ఎస్‌ఐగా నియమించారు. అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్వరరావును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఏలూరు వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ షేక్ జబీర్‌ను జంగారెడ్డిగూడెం ఎస్‌ఐగా,అక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ జ్యోతిబసును ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ధర్మాజీగూడెం ఎస్‌ఐ చెన్నారావును తడికలపూడి ఎస్‌ఐగా నియమించగా బుట్టాయిగూడెం ఎస్‌ఐ వెంకన్నను ధర్మాజీగూడేనికి నియమించారు. ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐ నవీన్‌కుమార్‌ను జీలుగుమిల్లికి, ఏలూరు వీఆర్‌లో ఉన్న దుర్గా మహేశ్వరరావును బుట్టాయి గూడేనికి బదిలీ చేశారు. ఏలూరు టూటౌన్ ఎస్‌ఐ షేక్ మదీనా బాషాను ఏలూరు వన్‌టౌన్ ఎస్‌ఐగా నియమించారు. పెదపాడు ఎస్‌ఐ శుభశేఖర్‌ను ఆగిరిపల్లికి బదిలీ చేయగా ఆగిరిపల్లి ఎస్‌ఐ సురేంద్రకుమార్‌ను ఏలూరు వీఆర్‌లో ఉంచారు. ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉన్న రమేష్‌బాబును కుక్కునూరు సీఐగా నియమించగా అక్కడ పనిచేస్తున్న శ్రీనివాసరావును ఏలూరు రేంజ్ వీఆర్‌లో ఉంచారు. భీమవరం జిల్లా దిశ పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.మురళీకృష్ణను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

పోలవరం దస్త్రాల దహనంపై కేంద్రం సీరియస్

కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



భీమవరం టౌన్, ఆగస్టు 20 : పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన దస్త్రాలు తగలబడిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా ఉందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. మంగళవారం భీమవరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ కూడా చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు. ఖచ్చితంగా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, తగలబడిన దస్త్రాలు వెనుక ఉన్న కథ ఏమిటి అన్న విషయాన్ని బయటకు లాగుతామన్నారు. విశాఖ రైల్వే జోన్ గతంలోనే ప్రకటన చేయడం జరిగిందని దీనికి సంబంధించి గత ప్రభుత్వం భూములు కేటాయింపు సరిగా చేయ లేదన్నారు. అందువల్లే ఆలస్యం అయ్యిందని ఇప్పుడు ముందుకు వెళ్ళే పరిస్థితి ఉందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఉన్నతాధికారులు స్వాతంత్ర్య దినోత్సవం నాడు సినిమా పాటలకు డ్యాన్స్ చేశారనే విషయం తన దృష్టి రాలేదని ఆ వీడియో పరిశీలించి అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, శాస్త్రవేత్తలు

యువత వ్యాపారాభివృద్ధిపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 20: పూలు, కూరగాయలు, పండ్లకు విలువ జోడించి మార్కెటింగ్ చేసుకునే దిశగా యువతను ప్రోత్సహించడమే లక్ష్యంగా శిక్షణ ఉపయోగపడాలని ఉద్యాన విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు కరుణశ్రీ అన్నారు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రంలో 15 రోజులుగా నాబార్డ్, ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న సూక్ష్మ వ్యాపార అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. కరుణశ్రీ మాట్లాడుతూ మహిళలు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడి ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధి మేనేజర్ అనిల్‌కాంత్, శాస్త్రవేత్తలు దీప్తి, దేవి వరప్రసాద్‌రెడ్డి, కె.వెంకట సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వెరైటీ శుభలేక

ప్రశ్నపత్రంలా ఆహ్వానపత్రిక





పెనుమంట్ర, ఆగస్టు 20 : పెనుమంట్ర మండలం మార్టేరుకు చెందిన వధువు తన పెళ్లి పత్రిక విభిన్నంగా ముద్రించి అందిరినీ ఆకట్టుకుంది. తన పెళ్లి పత్రికలో ఎనిమిది ప్రశ్నల రూపంలో పెళ్లి ఆహ్వాన పత్రిక సమగ్ర సమా చారాన్ని పొందు పరిచారు. సింగిల్ ఆన్సర్ ప్రశ్నలు, మల్టిపుల్ చాయిస్ ప్రశలు, ట్రు ఆర్ ఫాల్స్ ఇలా వివిధ ప్రశ్నల రూపంలో పెళ్లికి సంబంధించిన సమా చారాన్ని ఇవ్వడంతో పాటు నూటికి నూరు మార్కులు వచ్చినట్టుగా ముద్రిం చారు. వరుడు విశాఖపట్నంకి చెందిన ఫణేంద్ర అదానీ గ్రూప్ ఆఫ్ కంపెనీ మెకానికల్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. మార్టేరుకు చెందిన వధువు ప్రత్యూష విశాఖపట్నంలో పైడా కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నది. ఆమెకు ఈనెల 23న వివాహం. వధూవరులు, కన్యా దాతలు పేర్లు, పెళ్లి తేదీ, సమయం, కల్యాణ మండపం, విందుకు సంబంధించి ప్రశ్నలకు సమాధానంతో పెళ్లి ఆహ్వాన పత్రికను తీర్చిదిద్దారు. ఈ పెళ్లి శుభలేఖను బంధువులకు మిత్రులకు పంచారు. పలువురు ఆసక్తిగా చదివి అభినందించారు. అధ్యాపక వృత్తిలో ఉన్న తనకు తన వృత్తిని ప్రతిబింబించే విధంగా ఆహ్వాన పత్రికను అందించాలనే ఆలోచనతో ఇలా వినూత్నంగా ముద్రించినట్టు వధువు ప్రత్యూష 'ఆంధ్రజ్యోతి'కి తెలియజేసింది.


పెంటపాడు మండలం పరిమెళ్ళలో జగనన్న కాలనీ రహదారి నీటితో మునిగిపోవడంతో రాళ్లు అమర్చుకున్న లబ్ధిదారులు

ఆంధ్రజ్యోతి పరిశీలన

జగనన్న ఇళ్లకు

దారేది ?

జగనన్న కాలనీల్లో నివసిస్తున్న లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. సరైన వసతులు కల్పించకుండానే ఇళ్ల కట్టుకోవాలంటూ ఒత్తిడి చేశారు.. లేదంటే స్థలం వెనక్కు తీసుకుంటామని బెదిరించడంతో అప్పో సప్పో చేసి ఇళ్లు కట్టుకుని ఇళ్లల్లోకి వెళ్లిపోయారు. తీరా చూస్తే సరైన రోడ్లు లేవు.. డ్రెయినేజీ సదుపాయం లేదు.. కొన్ని చోట్ల వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేదు.. వెళ్లిన వారంతా నరకం చూస్తున్నారు. వర్షాకాలం కావడంతో పూడిక చేయక పోవడంతో కాలనీలు చెరువుల్లా మారుతున్నాయి.. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగిపోయి చిట్టడవిలా తయారయ్యాయి. విష సర్పాలు ఇళ్లలోకి వచ్చేస్తున్నాయి. ఎవరితో చెప్పుకోవాలో తెలియక నరకయాతన అనుభవిస్తున్నారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కొన్ని జగనన్న కాలనీలను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది.. అవి ఎలా ఉన్నాయంటే..


కాళ్లలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు చేరుతున్న దృశ్యం

అసౌకర్యాలకు నిలయంగా జగనన్న కాలనీలు
రహదారులు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు
వర్షం వస్తే చెరువులవుతున్నాయి
ఇళ్లల్లోకి చేరుతున్న విష సర్పాలు
మురుగునీటి నిల్వతో విజృంభిస్తున్న దోమలు
భయంతో జీవనం సాగిస్తున్న లబ్ధిదారులు

చిట్టడవిలా కాలనీలు

కాళ్ళ : మండలంలో 20 లేఅవుట్లో సుమారు 1981 మంది లబ్ధిదారులకు ఇళ్ళ స్థలాలు కేటాయించారు. వీటిలో దొడ్డనపూడి, పల్లిపాలెం, కోపల్లె గ్రామాల్లోని లేఅవుట్‌లు కోర్టు వివాదాల కారణంగా పట్టాలు పంపిణీ కార్యక్రమం నిలుపుదల చేశారు. మిగిలిన 17 లేఅవుట్‌లలో 1821 మందికి వేంపాడు, కోపల్లె, బొండాడ పేట, కాళ్ళ, కోలనపల్లి, ఏలూరుపాడు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. వీధిలైట్లు, సౌకర్యాలు లేకపోవడంతో లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. కొన్ని గ్రామాల్లో వేసిన లేఅవుట్‌లకు సరైన మార్గం లేక వాటిలో పిచ్చిమొక్కలు, తుమ్మచెట్లు మొలచి చిట్టడివిని తలపిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో విషసర్పాలు భయపెడుతున్నాయి.

పట్టా ఇచ్చారు..స్థలం ఏదీ : మహాలక్ష్మి, పెదఅమిరం

మా గ్రామానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న కోలనపల్లి గ్రామంలో స్థలం కేటాయించారు. తీరా అక్కడికి వెళ్ళి చూస్తే సుమారు 9 ఎకరాలు విస్తీర్ణంలో ఉన్న లేఅవుట్లో నాకు కేటాయించిన ప్లాట్ ఎక్కడుందో తెలియడం లేదు.

విష సర్పాల మధ్య జీవనం : గాదం నాగబాబు, కాళ్ళ



కాళ్ళలో జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుని మూడు నెలలు క్రితం వచ్చి నివసిస్తున్నాం. సరైన రోడ్డు మార్గం లేదు. వీధిలైట్లు అంతంత మాత్రమే. వర్షాకాలం కావడంతో కాలనీ అంతా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. విషసర్పాలు ఇళ్లల్లోకి వచ్చి భయపెడుతున్నాయి. మా బాధలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.

అడుగు బయట పెట్టాలంటేనే భయం

ఆకివీడు రూరల్ : తాళ్ళకోడులో అడుగ బయట పెట్టాలంటేనే భయపడుతున్నారు. ప్రధాన రహదారులు రెండు మాత్రమే నిర్మించారు, అవి ఇప్పుడు పూర్తిగా గోతులమయం. మిగిలిన రహదారులైతే అనమాలు కూడా కనపడడం లేదు. నరకప్రాయంగా ఉందని ఇళ్ళు నిర్మించుకున్న లబ్ధిదారులు వాపోతున్నారు.డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్ళు నిర్మించుకోని స్థలాలలోనికి చేరుతున్నది. దీంతో దోమలకు ఆలవాలంగా మారిపోయింది. కనీసం కచ్చా డ్రైన్‌లు తవ్వించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. తాగునీరు, ఉపయోగించు కునేందుకు నీటిని సరఫరా చేసేందుకు పూర్తిస్థాయి చర్యలు తీసుకోలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాములు వచ్చేస్తున్నాయి..



తణుకు : పైడిపర్రు జగనన్న కాలనీలో కాలనీల్లో మౌళిక సదుపాయాలు లేక అక్కడ నివాసం ఉంటున్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. వర్షం వస్తే కాలనీ చెరువులా మారుతోంది. ఖాళీ స్థలాలు పిచ్చి మొక్కలతో నిండి పోయాయి. దీంతో విషసర్పాలు సరాసరి ఇళ్లల్లోకి వస్తున్నాయి. ఇటీవల వర్షాలకు విష సర్పాలు ఇంట్లోకి రావడంతో బెంబేలెత్తి పోయారు. రోడ్డు పూడ్చకపోవడం వల్ల నీరుతో నిండిపోతున్నాయి. తమను పట్టించుకునేవారే లేరని అక్కడ ఇళ్లు కట్టుకున్నవారు వాపోతున్నారు.

అప్పులు చేసి కట్టాం

పెంటపాడు : మండలంలోని పరిమెళ్లలోని కాలనీలో మౌళిక వసతులు, కనీస సదుపాయాలు లేకపోవడంతో చాలామంది ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు ముందుకు రాలేదు. స్థానిక వైసీపీ నాయకులు, అధికారులు ఇంటి నిర్మాణం చేపట్టకుంటే స్థలాన్ని వేరే వాళ్ళకు ఇచ్చేస్తామంటూ లబ్ధిదారులను భయపెట్టడంతో చేసేది లేక లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన సొమ్ము కాకుండా ఒక్కో ఇంటికి సుమారు రూ.10 లక్షలకు పైగా వెచ్చించి ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. ఇప్పుడు కాలనీలో మౌలిక వసతుల కొరత లబ్ధిదారులకు ఇబ్బందిగా మారింది.

నడిచే మార్గం లేదు : జి.రత్నం, పరిమెళ్ళ



జగనన్నకాలనీలో స్థలం వచ్చింది. ఇల్లు కూడా నిర్మించుకున్నాం. ఇప్పటి వరుకూ కాలనీలో డ్రైనేజీ సదుపాయం లేదు. రహదారులు కూడా లేవు. వర్షం వస్తే కాలనీ మొత్తం మునిగి పోతుంది. నడిచే మార్గం లేక చిన్న పిల్లలతో చాలా ఇబ్బంది పడుతున్నాం. కాలనీలో రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలి

బురదలో నడిచి వెళ్లాలి



భీమడోలు : మండలంలో జగనన్న కాలనీల పేరిట 2,050 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయగా 1265 మంది ఇళ్ల నిర్మించుకున్నారు. ప్రధా నంగా భీమడోలు, గుండుగొలను, పూళ్ళ గ్రామాల కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భీమడోలు కాలనీలో నిర్మాణాలు చేపట్టని స్థలాలు చెరువులను తలపిస్తున్నాయి. రోడ్డు మార్గం లేక బురదలో నడ వాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. గుండుగొలనులో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నీరు ఇవ్వండి : శ్రీనివాసరావు, భీమడోలు



భీమడోలు దిగుడు పాటిదిబ్బ ఇళ్ళ కాలనీలో సరైన నీటి సౌకర్యం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. అలాగే ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలి.

పునాదుల్లోనే నిలిచిపోయాయి



పెదపాడు : మండలంలోని జయపురంలో 44 మందికి ముప్పర్రు ప్రధాన రహదారి పక్కనే 47 ప్లాట్లు వేశారు. మొత్తం వ్యవహారంలో భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. నిర్మాణం ప్రారంభమైన 44 ఇళ్లలో ఒక్కటి పూర్తికాగా, మిగతా 43 ఇళ్ల పునాదుల చుట్టూ ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. ఇనుప చువ్వలు తుప్పుపట్టిపోయాయి.

నడిచేందుకు కూడా వీలు లేదు



దెందులూరు: నడవడానికి కూడా వీలులేని విధంగా ఉన్న జగనన్న కాలనీలో ఉండేదెలా అని పేదలు గగ్గోలు పెడుతున్నారు. వైసీపీ పాలనలో జగనన్న కాలనీ స్థలాల మెరక పేరుతో డబ్బులు వసూలు చేశారని పలు వురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో రోడ్లు కానీ, డ్రెయినేజీలు ఏర్పాటు చేయలేదు. చల్లచింతలపూడి కాలనీలో మోకాలి లోతు బురదలో విద్యార్థులు, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోపన్నపాలెం కాలనీలో మోటార్ సైకిల్స్ ట్రాక్టర్లు సైతం దిగబడిపోతున్నాయి.

పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటే అవస్థలు



ఉంగుటూరు : మండలంలో 40 కాలనీల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. 916 ఇళ్లు మంజూరు చేయగా 800 ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 600 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. చేబ్రోలు కాలనీ మినహా మిగతా చోట్ల అక్కడక్కడ నిర్మాణాలు సాగుతున్నాయి. పలు కాలనీల్లో రహదారులు, డ్రెయిన్లు సౌకర్యం లేదు. వర్షం పడితే బురదలో వెళ్లాల్సిందే. గృహ ప్రవేశం చేసిన చోట పిల్లలు స్కూళ్లకు వెళ్లాలంటేనే అవస్థలు పడుతున్నారు. ఉంగుటూరులో సర్పంచ్ బండారు సింధు రహదారుల్లో కంకర నింపడం కాస్త ఉపశమనం పొందుతున్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లు



జంగారెడ్డిగూడెం : పట్టణంలో జగనన్న కాలనీల్లో కాంట్రాక్టర్లు నిర్మించిన ఇళ్లు అప్పుడే శిథిలావస్థకు చేరుకున్నాయి. పునాదులు, మెట్లు, గచ్చు, ప్లాస్టింగ్, బాత్‌రూమ్ లేకుండా ఇళ్లను నిర్మించి కాంట్రాక్టర్లు బిల్లులు చేయిం చుకున్నారు. కాలనీల్లో కనీస సౌకర్యాలు లేవు. మొక్కుబడిగా నిర్మించిన ఇళ్లు పడిపోయే స్థితిలో ఉన్నాయి. నేలకు సమాంతరంగా ఇళ్ల నిర్మాణం చేప ట్టడంతో వర్షం పడితే బయట నీరంతా ఇంట్లో చేరుతోంది. పట్టణంలో ఐదు కాలనీల్లో 2097 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. కేవలం 704 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

క్రైం కార్నర్

మొగల్తూరు జాతీయ రహదారిపై సినీ ఫక్కీలో దోపిడీ

మొగల్తూరు, ఆగస్టు 20: మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి సినీఫక్కీలో దారిదోపిడీ జరిగింది. ఏఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన ముసునూరి దుర్గరాజు సోమవారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో జగన్నాథపురం నుంచి బైక్‌పై పాలకొల్లు వెళుతున్నాడు. మొగల్తూరు పంచాయతీ పరిధి కోతుల గుంట సమీపంలో జాతీయ రహదారిపై టాయ్‌లెట్‌కు వెళ్ళేందుకు బైక్ ఆపాడు. ఇది గుర్తించిన ఇరువురు వ్యక్తులు ఒకబైక్‌పై వచ్చి అతడిని వెంబడించి అతడిని అడ్డగించి జేబులో ఉన్న రూ.22 వేలు నగదు, సెల్ ఫోన్ తీసుకుని పరారయ్యారు. షాక్ అయిన దుర్గరాజు కొంత సేపటికి తేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇటువంటి ఘటనలు జరిగిన దాఖలాలు లేవు. సుమారు ఏడాది కాలంగా ఈజాతీయ రహదారిపై పోలీస్ పెట్రోలింగ్ కూడా లేకపోవడంతో దోపిడీదారులకు అడ్డాగా కనిపిస్తోంది. జాతీయ రహదారిపై రాత్రి వేళల్లో విద్యుత్ సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో లేకపోవడం, ట్రాఫిక్ పెరగడం నేపథ్యంలో హైవే పెట్రోలింగ్ పోలీసులు పర్యవేక్షణ పెంచాల్సి ఉంది.

తల్లి మందలించిందని బాలిక ఆత్మహత్య

జీలుగుమిల్లి, ఆగస్టు 20 :బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ చెప్పారు. కామవరపుకోటకు చెందిన మామిడి మరియమ్మ కూతురు ఇంటర్ పూర్తయింది. పాములవారిగూడెంలో దుర్గాప్రసాద్ కోళ్లఫారం వద్ద కొంత కాలంగా కూలిపనుల నిమిత్తం వచ్చి ఉంటున్నారు. వారం రోజులుగా తన కూతురు తరచూ ఫోన్ చూస్తుండటం, చెప్పిన పనులు చేయకపోవడంతో సోమవారం రాత్రి తల్లి మందలించింది. దీంతో బాలిక మనస్తాపం చెందింది. కోళ్లకు ఇన్‌ఫెక్షన్ రాకుండా వాడే ఇంజక్షన్ తాగి ఆత్మహత్య చేసుకుంది. బాలికను జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జీవితంపై విరక్తితో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : ఆర్థిక పరిస్థితులు, కుటుంబ గొడవలు, మరోవైపు అనారోగ్యం.. దీంతో జీవితంపై విరక్తి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు ఎన్టీఆర్ కాలనీలో నివాసం ఉంటున్న కొప్పినీడి శరత్ శ్రీనివాస్ (42) ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. 15 సంవత్సరాల క్రితం అతనికి వివాహం అయింది. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాలతో ఏడు సంవత్సరాల క్రితం విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. మానసికంగా ఇబ్బందులకు గురవుతూ అనారోగ్యం పాలయ్యాడు. దీంతో మూడు నెలల నుంచి మెడికల్ లీవు పెట్టాడు. ఒంటరిగా ఉంటున్న అతను సోమవారం రాత్రి పడుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం వరకు ఇంట్లో నుంచి బయటకు రాకపోయేటప్పటికి అతని సోదరుడు వెళ్ళి తలుపుకొట్టాడు. తలుపు తీయకపోవడంతో కిటికీ వైపు చూడగా ఉరి వేసుకుని కనిపించాడు. దీంతో ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్‌ఐ రాజా రెడ్డి తన సిబ్బందితో వెళ్ళి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏలూరులో పదకొండు కాసుల బంగారం చోరీ

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : ఇంటి తాళాలు పగులగొట్టి దొంగలు బంగారు ఆభరణాలు అపహరించారని ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఇంద్రప్రస్థ హౌసింగ్ కాలనీలో చెట్టుపల్లి ప్రసాద్ తన కుటుంబంతో ఈనెల 17వ తేదీన బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యానికి వెళ్ళారు. తిరిగి మంగళవారం ఉదయం వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగుల గొట్టి ఇంట్లోని 11 కాసుల బంగారు ఆభరణాలు, 25 వేల రూపాయల నగదు, వెండి వస్తువులు అపహరించారు. దీనిపై ఏలూరు త్రిటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఆగస్టు 20 : కుమారుని వద్దకు వచ్చి తిరిగి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఒక కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. చింతలపూడి మండలం పట్టాయిగూడేనికి చెందిన తొమంద్రు లాజరు (51) ఏలూరు సమీపంలో ఉన్న వట్లూరులోని తమ కుమారుని వద్దకు మోటారు సైకిల్‌పై వచ్చాడు. తిరిగి మంగళవారం వెళ్తుండగా మార్గమధ్యలో దుగ్గిరాల బ్రిడ్జి వద్ద ఒక కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అత్యవసరపు విభాగపు వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఈ సంఘటనపై ఏలూరు త్రి టౌన్ సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాస్త..చేయేస్తారా..!

ఎర్రగుంటపల్లిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



చింతలపూడి,ఆగస్టు 20: కాలం చెల్లిన బస్సులతో ఇటు ఆర్టీసి సిబ్బందికి, అటు ప్రయాణికులకు రక్షణ లేకుండా పోయింది. మంగళవారం ఏలూరుకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు చెడిపోయి నిలిచిపోయాయి. ఒకటి రామచంద్రపురం సమీపంలో మరొకటి ఎర్రగుంటపల్లి వద్ద చెడిపోయి నిలిచిపోయాయి. ఈ మార్గంలో ప్రతీరోజు ఏదోఒక చోట బస్సులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో సగం తెలంగాణ సర్వీసులు నడుస్తున్నాయి. దీనివల్ల రాష్ట్ర సర్వీసు బస్సులు వచ్చేవరకు ఆగాలి. లేదా ఏ ఆటోనో ఆశ్రయించాలి. మహిళా ప్రయాణికులు, పిల్లలతో, లగేజీలతో ప్రయాణించేవారు ఇదేం ఖర్మరా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ బస్సులు నిలిచిపోతే పరిస్థితి ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బస్సులో బంగారు ఆభరణాల బ్యాగ్

డిపో మేనేజర్‌కు అప్పగించిన డ్రైవరు.. ప్రయాణికుడికి అందజేత



తణుకు, ఆగస్టు 20 : హైద్రాబాదు బీహెచ్ ఈఎల్ నుంచి తణుకు వచ్చిన నైట్ రైడర్ బస్సులో పేర్ల ప్రదీప్ అనే ప్రయాణికుడు ఆరు లక్షల విలువైన బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్ మర్చిపోయి విజయవాడలో దిగిపోయాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. తణుకు వచ్చిన తర్వాత బస్సులో బ్యాగును గమనించిన డ్రైవర్లు యన్నం వెంకట గోపాలరావు, పెనుమత్స శ్రీనివాసరాజులు ఆ బ్యాగును తణుకు డిపో మేనేజర్ గిరిధర్‌కు అప్పగించారు. ప్రదీప్‌కు సమాచరం ఇవ్వడంతో తణుకు వచ్చి ఆ బ్యాగ్ తీసుకున్నాడు. డ్రైవర్లు నిజాయితీగా వ్యవహరించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చారని డీఎం అభినందించారు.

మావుళ్లమ్మకు కలెక్టర్ నాగరాణి పూజలు


కలెక్టర్‌కు అమ్మవారి ఫొటో అందిస్తున్న ఈవో నగేష్

భీమవరంటౌన్, ఆగస్టు 20 : మావుళ్ళమ్మ అమ్మవారిని కలెక్టర్ చదలవాడ నాగరాణి మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం తరపున ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మినగేష్ శేషవస్త్రం, అమ్మవారి ఫొటో అందించారు. భీమవరం డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు ఉన్నారు.

సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని సద్వినియోగించాలి

విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగరాణి కోరారు. మంగళవారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో విద్యుత్ ఆదాకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు, వినియోగదారుల బిల్లులు చెల్లింపునకు ఏర్పాటు చేసిన ప్రచార సాధనాలను ఆమె పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ పొదుపునకు సరైన మార్గం సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవడమేనన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవడానికి పెద్ద మొత్తంలో సబ్సిడీ అందుతుందన్నారు. ఈమేరకు వెబ్‌సైట్‌లోకాని, పోర్టర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, డీఈఈ రాజగోపాల్ చౌదరి తదితరులు ఉన్నారు.

దేవాలయ భూముల అన్యాక్రాంతంపై దృష్టి పెట్టాలి

భీమవరంటౌన్, ఆగస్టు 20 :దేవదాయ భూములు అన్యాక్రాంతం కాకుండా అధికారుల కమిటీ సమష్టిగా దృష్టి పెట్టాలని జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్‌లో దేవదాయ భూముల సంరక్షణపై జిల్లాస్థాయి ఇంటర్నల్ డిపార్ట్మెంటల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. తొలి సమావేశంలో తాడేపల్లిగూడెం తాళ్ల ముదునూరుపాడు గ్రామం బాల వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన అన్యాకాంతమైన భూమి 17.26 ఎకరాలు 166 మంది స్వాధీనంలో వున్న భూములపై చర్చించారు. వీటిపై దేవస్థానం అధికారులు దేవస్థానం ట్రిబ్యునల్ విచారణకు వేయగా 86 డిక్రీలను పాస్ చేశారు. దీనిపై 14 మంది హైకోర్టును ఆశ్రయించారని అధికారులు వివరించారు. జేసీ మాట్లాడుతూ 14 కేసులను తాత్కాలికంగా మినహాయించి, మిగిలిన కేసులకు సంబంధించిన భూములు స్వాధీనం చేసుకునేందుకు చర్యలు ప్రారంభించాలన్నారు.

జేసీని కలిసిన వీఆర్‌వోల సంఘ నాయకులు

పెనుమంట్ర : జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డిని జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మిరియాల లక్ష్మీనా రాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు గుమ్మల్ల జక్కరయ్య మర్యాదపూర్వ కంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరే లక్ష్యం : రఘురామ


పంట కాల్వ వద్ద భూమిపూజ చేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు

ఉండి ఆగస్టు 20:ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించడమే లక్ష్యమని ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం ఉండి-పాములపర్రు పంట కాల్వ వద్ద అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాములపర్రు పంటకాలువ ఆక్రమణలకు గురికావడంతో ఆ గ్రామస్థులు మంచినీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అభివృద్ధి పనులకు ఆటంకంగా వున్న ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. సర్పంచ్ కేశన శాంతికుమారి బలుసులరావు, ఎంపీటీసీ యడవల్లి వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, తోట రాము, తదితరులు ఉన్నారు.

టీపీగూడెంలో ఎయిర్‌పోర్ట్‌కు కృషి : బొలిశెట్టి

పెంటపాడు, ఆగస్టు 20: తాడేపల్లిగూడెంలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పట్టణంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గం జిల్లాకు వ్యాపార కేంద్రమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విషయాన్ని తెలిపామన్నారు. వెంకట్రామన్నగూడెం అటవీ భూములను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సేకరించాలని, దీనికి కూటమి నాయకుల సహకారం కావాలన్నారు. కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న, నల్లమిల్లి చినగోపిరెడ్డి, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, బోరాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల మరమ్మతులు నాణ్యతగా ఉండాలి

రహదారి మరమ్మతు పనులు నాణ్యతగా చేపట్టాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆదేశించారు. ప్రత్తిపాడు జాతీయ రహదారి జంక్షన్ నుంచి బాదంపూడి వరకు జరుగుతున్న పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వర్షాలు రాకముందే పనులు పూర్తి చేయాలని సూచించారు. గంటా నాగ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **నరసాపురం రూరల్, ఆగస్టు 20:** ఈ-క్రాప్ నమోదుపై వ్యవసాయ శాఖ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని మంగళవారం సిబ్బందితో సమీక్ష సమావేశంలో ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి ఆదేశించారు.
- **పెనుగొండ :** బాల కార్మికులను ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుగొండలో నరసాపురం డివిజన్ అసిస్టెంట్ లేబర్ అధికారి కేబీఆర్ శర్మ పలు దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఐసీడీఎస్, పోలీసు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.
- **పాలకొల్లు అర్బన్ :** సార్వత్రిక విద్యాపీఠంలో 2024-25 సంవత్సరం ప్రవేశాల ప్రక్రియపై పట్టణంలో మంగళవారం ఎంఈవోలు గుమ్మళ్ళ వీరాస్వామి, ఆర్ఎస్‌ఎస్‌పీ గంగాధర శర్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఎంకేఎస్ఎం హైస్కూల్ హెచ్ఎం అడ్డాల సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **భీమవరంటౌన్ :** బ్రహ్మ సమాజం 19వ శతాబ్దంలో బెంగాల్‌లో ఒక సామాజిక-ధార్మిక సంస్కరణల ఉద్యమంగా రూపుదాల్చిందని బ్రహ్మసమాజాన్ని రాజా రామ్మోహనరాయ్ స్థాపన దినోత్సవ సమావేశంలో ఆర్‌ఆర్‌డీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వికేజె ప్రసూన అన్నారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** తాడేపల్లిగూడెం మసీదు సెంటర్ వద్ద వల్లి మోహన్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ చేతుల మీదుగా పేద మహిళలకు నిత్యావసర సరుకులు, బియ్యం అందించారు. సంస్థ అధ్యక్షుడు పటాన్ వల్లి, గాంధీ మండపం సేవాసమితి అధ్యక్షుడు దుర్గా రామచంద్రరావు పాల్గొన్నారు.
- **ఆకివీడు :** మైనర్లకు తల్లిదండ్రులు మోటారు వాహనాలు ఇచ్చి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని గాంధీజీ సెంటర్‌లో వాహనాల తనిఖీల్లో ఎస్ఐ బత్తిన నాగబాబు హెచ్చరించారు.
- **అత్తిలి :** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సెప్టెంబరు మూడో తేదీలోపు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గానికి ఓటర్లుగా నమోదయ్యేందుకు ఫామ్ 19లో దరఖాస్తు చేయాలని అత్తిలి తహసీల్దార్ దశిక వంశీ తెలిపారు.
- **పెనుగొండ :** పెనుగొండ కోడిపందేల దిబ్బ ప్రాంతంలో నివశిస్తున్న ప్రజలు వినతి మేరకు సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం వీధి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు.
- **తాడేపల్లిగూడెం రూరల్ :** బీజేపీ నరసాపురం మీడియా కన్వీనర్ నరిసే సోమేష్ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ చేతుల మీదుగా ఆటో యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులకు యూనిఫారాలు అందించారు. అగ్ని ప్రమాద బాధిత బాలిక చికిత్సకోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.
- **పాలకొల్లు అర్బన్ :** స్థానిక ఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 24న హైదారాబాద్‌కు చెందిన వికార్త్రీ సొల్యూషన్స్ కంపెనీలో ఉద్యోగాలకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. వివరాలకు 70136 29841 సంప్రదించాలన్నారు.

వైద్యురాలిపై హత్యాచారం దారుణం

- భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు
- న్యాయవాదులు, విద్యార్థుల నిరసన ర్యాలీలు



భీమవరంలో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే అంజిబాబు, తదితరులు..



తణుకులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న న్యాయవాదులు

భీమవరం టౌన్, ఆగస్టు 20 : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని నిరసిస్తూ భీమవరం నియోజకవర్గ కూటమి నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ప్రకాశం చౌక్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ డాక్టర్ హత్యాచారంపై విచారణ వేగవంతం చేయాలని, ఇటువంటి ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అనంతరం జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ, బండి రమేష్ కుమార్, మండల అధ్యక్షుడు మోకా శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు తదితరులు పాల్గొన్నారు.

● తణుకు : జూనియర్ డాక్టర్‌పై హత్యాచారానికి నిరసనగా తణుకు బార్ అసోసియేషన్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ అశోకవర్మకు వినతిపత్రం అందించారు. బార్ అసోసియేషన్ నాయకులు కొండా శ్రీనివాసు, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, పొట్ల సురేష్, అంబేడ్కర్, కామన మునిస్వామి, అనుకుల రమేష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : కోల్‌కతాలో ఇటీవల జరిగిన దారుణ అకృత్యానికి నిరసనగా పట్టణంలోని పలు కళాశాలల విద్యార్థులు మంగళవారం నిరసన ర్యాలీ చేపట్టారు. విద్యార్థి సంఘాలు ఎస్ఎఫ్ఐ, ఏఎస్ఎఫ్ఐ నాయకులు, ఆదిత్య డిగ్రీ కళాశాల, డీఎన్ఆర్, ఏఎస్ఎన్ఎం, చాంబర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● ఉండి : కోల్‌కతాలో జూనియర్ డాక్టరుపై అత్యాచారం చేసి హత్యచేసిన కిరాతకులను తక్షణమే పట్టుకుని తగిన శిక్ష వేయాలని కోరుతూ ఉండి మండలం యండగండి జూనియర్ కళాశాల విద్యార్థులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అధ్యాపకులు ఎ.శ్రీనివాసరావు, వల్లభు చక్రవర్తి, కేఎస్ఎన్‌వీవీఎస్‌మూర్తి, నల్లి రవి, సలోమి, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవత సేవలు అభినందనీయం : బొలిశెట్టి


పెంటపాడు శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి

పెంటపాడు, ఆగస్టు 20: మానవత సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడులో మంగళవారం మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంస్థకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. గేటు సెంటర్ వద్ద పర్యావరణాన్ని కాపాడాలని మానవహారం నిర్మించారు. అనంతరం పెంటపాడులో రూ.20 లక్షలతో నిర్మించిన మానవత ఫ్రీజర్ షెడ్డును ఆ సంస్థ జిల్లా నాయకుడు తాడేపల్లి మోహన్‌రావు ప్రారంభించారు. ఎంఈవో రామకృష్ణ, హెచ్ఎం రాజేష్, పుల్లా బాబి, బోరాడ శ్రీనివాస్, కే.పెంటపాడు సర్పంచ్ సత్యనారాయణ, తారాడీ పాల్ తదితరులు పాల్గొన్నారు.

● పాలకొల్లు రూరల్ : పాలకొల్లు మండల మానవతా సంస్థ ప్రపంచ శాంతి కోరుతూ మంగళవారం నిర్వహించిన శాంతి ర్యాలీని పట్టణ ఏఎస్ఐ ఏకే రామయ్య జెండా ఊపి ప్రారంభించారు. సంస్థ చైర్మన్ వర్మ ఆధ్వర్యంలో పలు పాఠశాల విద్యార్థులతో ర్యాలీ కొనసాగింది. కన్వీనర్ ముత్యాల రామారావు, అధ్యక్షుడు మద్దాల వాసు, ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ప్రతాప్ రాజు, అంగర చిన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

● గణపవరం: గణపవరంలో మానవత స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు ఆధ్వర్యంలో సభ్యులు, విద్యార్థులు, పురవీధుల్లో శాంతిర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో జిల్లా మానవత రీజనల్ కన్వీనర్ కాకర్ల వినాయక్, మండల రీజియన్ కన్వీనర్ వంకాయల రామారావు, మండల అధ్యక్షుడు బుద్దారపు పుల్లయ్య, డైరెక్టర్లు కూనసాని నాగేశ్వరరావు, సీహెచ్. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● ఉండి : ఉండిలో మంగళవారం మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని ఈవోపీఆర్‌డీ రామకృష్ణ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులు పెన్మెత్స రామకృష్ణంరాజు, రంగరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

బియ్యపుతిప్ప సమస్యల్ని పరిష్కరిస్తా : నాయకర్

నరసాపురం రూరల్, ఆగస్టు 20 : బియ్యపుతిప్ప గ్రామంలో సమస్యలను పరిష్కరిస్తామని, హార్బర్ నిర్మాణానికి ప్రభుత్వ కట్టుబడి ఉందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. మంగళవారం రాత్రి గ్రామంలో జనవాణి నిర్వహించి గ్రామస్థుల నుంచి వినతులు స్వీకరించారు. తాగునీరు, రోడ్లు, విద్య, లో-ఓల్టేజ్, మత్స్యకార రుణాలు తదితర అంశాలపై అధికసంఖ్యలో వినతులొచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల జీవనోపాధి పెంపొందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తీర గ్రామంలో గురుకుల పాఠశాల ఏర్పాటు చేయించి, విద్యాప్రమాణాలు పెంచుతానన్నారు. వాతాడి కనకరాజు, తిరుమాని శ్రీరాములు, మైల శివ, డేవిడ్, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అల్లూరి' మెమోరియల్ హాల్ నిర్మించాలి

భీమవరం అర్బన్, ఆగస్టు 20:భీమవరం పాత బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్‌ను నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. మంగళవారం ఈ మేరకు ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబును కలిసి వినతిపత్రం అందించారు. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి పాలక మున్సిపల్ కౌన్సిల్ నూతన నిర్మాణం పేరుతో కూల్చేసిందని ఈ నిర్మాణానికి నిధులు కేటాయించిన్నట్టు చెప్పారు. కానీ నేటికీ నిర్మించలేదన్నారు. హాల్ కూల్చిన ప్రాంతం అంతా మున్సిపల్ చెత్తతో డంపింగ్ యార్డ్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కూటమి అధికారంలో ఉన్నందున ఎమ్మెల్యే ఆధ్వర్యంలో హాల్ నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వాసుదేవరావు, వైకుంఠరావు, ఆంజనేయులు, డి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవికి వెండి వస్తువుల బహూకరణ

కాళ్ళ, ఆగస్టు 20 : కోమటిగుంట దుర్గాదేవి అమ్మవారికి భక్తులు వెండి వస్తువులు బహూకరించారు. మంగళవారం గ్రామానికి చెందిన జిన్నా మావుళ్ళరావు, ముత్యవేణి దంపతుల కుటుంబ సభ్యులతో కలిసి నాలుగు తులాల వెండి దీపపు కుందులు అమ్మవారికి అందజేశారు. ఆలయ కమిటీ వారు దాతలను సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఆలయ నిర్మాణకర్త ఎరుబండి రామాంజనేయులు కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన వలవల


సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 20: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్‌ను మంగళవారం సచివాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి మర్యాద పూర్వకంగా కలిసి నియోజకవర్గ సమస్యలను విన్నవించారు. నియోజకవర్గ అభివృద్ధికి చేయూతనివ్వాలని కోరారు. నియోజకవర్గంలో కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం సూచించినట్లు బాబ్జి తెలిపారు.

దాతల సహకారం మరువలేనిది

తణుకు, ఆగస్టు 20: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సేవా కార్యక్రమాలకు దాతల సహకారం మరువలేనిదని సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి అన్నారు. మంగళవారం సంఘ కార్యాలయంలో బోళ్ళ వీరవెంకన్న ఫిజియోథెరపీ కేంద్రంలో రూ. 35 వేల విలువ చేసే ఫిజియోథెరపీ పరికరాలను అతికాల ప్రసాదరావు ఆర్థిక సాయంతో ప్రారంభించారు. అనంతరం సంఘం తరపున ప్రసాదరావును సత్కరించారు. సంఘ కార్యదర్శి ఎండీ స్వాలిహా, కోశాధికారి అర్థి భాస్కరరావు, సభ్యులు దాట్ల రామరాజు, సాంబశివరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

గ్రామ దేవతలకు నైవేద్యం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెంటపాడు, ఆగస్టు 20: శ్రావణ మంగళవారం సందర్భంగా పెంటపాడు గ్రామ దేవతలు పెంట్లమ్మ, కొర్లపాటి వెంకమ్మ అమ్మవార్లకు గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో చలి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని ఆడపడుచులకు పసుపు, కుంకుమ, గాజులు, ప్రసాదాన్ని అందజేశారు. సత్తి నర్సారెడ్డి, చామన విజయ్‌కుమార్, కొవ్వూరి బాలభాస్కరరెడ్డి, శీలంశెట్టి రామచంద్రరావు, చామన సురేష్, వెలగల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ పంపిణీ

భీమవరంటౌన్, ఆగస్టు 20:మెంటే వారితోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి దేవి అమ్మవారికి పౌర్ణమి సందర్భంగా సోమవారం అలం కరించిన మూడు వేల గాజులు, పసుపు, కుంకుమలను మహిళలకు మంగళవారం అందజేశారు. తొలుత ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు కొమ్ము శ్రీనివాస్‌చే అమ్మవారికి పూజలు నిర్వహించి అలంకరణ అనంతరం గాజులు, పసుపు కుంకుమలను భక్తులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వీర పేరంటాలమ్మ ఆలయంలో చండీహోమం

ఉండి ఆగస్టు 20 :గ్రామాభివృద్ధిని, శాంతిని కోరుతూ వీర పేరంటాలమ్మ ఆలయంలో చండీహోమం నిర్వహించామని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మంతెన రంగరాజు తెలిపారు. మంగళవారం వెలివర్రులోని పేరంటాలమ్మ ఆలయంలో పీటలపై రంగరాజు, త్రివేణి దంపతులు కూర్చుని పూజలు చేశారు.

'మహనీయుడు రాజీవ్ గాంధీ'


రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణలో కొయ్యే, పులపర్తి, కనుమూరి

భీమవరం అర్బన్, ఆగస్టు 20 : టెలికాం రంగంలో విప్లవాత్మక మార్పు తెచ్చి దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని ఏపీ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు అన్నారు. భీమవరం గునుపూడిలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి పురస్కరించుకుని విగ్రహాన్ని మంగళవారం వారు పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంకెం సీతారాం మాట్లాడారు. వబిలిశెట్టి కనకరాజు, బండి రమేష్‌కుమార్, రామకృష్ణ, జంపన సుబ్రహ్మణ్యంరాజు, బాధరాల పుల్లేశ్వరరావు, ఎస్.సెల్వియా, నాయకులు పాల్గొన్నారు.

● పాలకొల్లు అర్బన్ : దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 80వ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలుకులూరి అర్జునరావు, నాయకులు బోనం వెంకట్రావు, ములకల గోపాలరావు, వర్ధనపు కాసు, బొలిశెట్టి భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

27 మంది రక్తదానం

నరసాపురం టౌన్/ఆకివీడు, ఆగస్టు 20:ప్రజలకు మంచి చేసే వారికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు అన్నారు. మంగళవారం నరసాపురం పట్టణంలో సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకల్లో భాగంగా చిరంజీవి యువత ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 27 మంది రక్తదానం చేశారు. మాదంశెట్టి కోటేశ్వరరావు, పోలిశెట్టి సత్తిబాబు, కోపల్లి శ్రీను, కోటిపల్లి వెంకటేశ్వరరావు, చెన్నంశెట్టి నాగు, గ్రంధి శ్రీను, చాగంటి ఆనంద్, జి.బుజ్జి, బాబి, కృష్ణ, హేమ, నాని, సూరిబాబు, కోటి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేత

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చిరంజీవి ఫ్యాన్స్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి సత్యనారాయణ అన్నారు. చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఆకివీడు జానకీనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి అందచేసి మాట్లాడారు. పాఠశాల హెచ్ఎం విక్రమ్, జనసేన కౌన్సిలర్లు గోపిశెట్టి వెంకటసత్యవతి, గుర్రాని నాగలక్ష్మి, బచ్చు సరళాకుమారి, జి.సునీత ఉన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

పెంటపాడు/గణపవరం, ఆగస్టు 20: పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆఫీస్ అప్రెంటీస్‌షిప్ కోర్సుకు అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.చంద్రశేఖర్ బాబు తెలిపారు. ఏదైనా డిగ్రీతో పాటు, షార్ట్‌హ్యాండ్, ఇంగ్లీష్ హయ్యర్ లేదా లోయర్ పూర్తి చేసి ఉండాలన్నారు. ఆసక్తి గల వారు సర్టిఫికెట్లతో ఈనెల 24న ఉదయం 11 గంటలలోపు కళాశాలకు రావాలన్నారు.

కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుల భర్తీకి..

గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపకుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మల కుమారి తెలిపారు. అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టు ఎంఎస్సీ కంప్యూటర్స్‌లో పోస్టుగ్రాడ్యుయేట్‌ల నుంచి 55 శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, ఎన్ఇటీ, ఎస్ఎల్ఈటీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. వివరాలకు 79010 56668 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

క్రైం సమాచారం

40 బస్తాల పీడీఎఫ్ బియ్యం పట్టివేత

నరసాపురం, ఆగస్టు 20 : పట్టణంలోని మేదర్ల వంతెన వద్ద అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల పీడీఎఫ్ బియ్యం పట్టుకున్నట్టు సివిల్ సప్లై డీడీ నాగదేవి తెలిపారు. మంగళవారం ఓ వ్యాన్‌లో తరలిస్తున్నట్టు సమాచారంతో పోలీసులు నిఘా పెట్టి పట్టుకుని సివిల్ సప్లై శాఖకు అప్పగించారన్నారు. వ్యాన్‌ను స్వాధీనం చేసుకొని, డ్రైవర్ రాముపై కేసు నమోదు చేశామన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఒకరికి గాయాలు

ఆచంట,ఆగస్టు 20 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి కాలు విరిగిన ఘటన మార్టేరులో మంగళవారం జరిగింది. ఎస్ఐ కట్టా వెంకట రమణ తెలిపిన వివరాలివి.. మార్టేరుకు చెందిన పి.రమేష్ అనే వ్యక్తి ఈనెల 16న మార్టేరు నుంచి ఓ ఫంక్షన్‌కు కందరవల్లికి వచ్చి తిరుగు ప్రయాణంలో కొడమంచిలి రోడ్డులో రాత్రి పూట గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడికి కాలు విరిగిపోవడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మద్యం తాగొచ్చి తిట్టాడని మహిళ ఫిర్యాదు

ఆకివీడు, ఆగస్టు 20 : మద్యం తాగొచ్చి రాత్రి సమయంలో మహిళలు ఉన్న ఇంటికి వచ్చి తలుపులు, గేట్లను తన్నుతూ బూతులు తిట్టాడని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ బత్తిన నాగబాబు తెలిపారు. పెదకాపవరంలో వుదిశి నాగలక్ష్మి, తన కుమార్తె ఈనెల 18న ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన వలవల సోమేశ్వరరావు తన భర్త లేని సమయంలో రాత్రి సమయంలో వచ్చి తాగి వచ్చి తిట్టాడని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లేసు పార్కు పాలవకవర్గం ఎన్నిక వాయిదా

నరసాపురం రూరల్, ఆగస్టు 20: లేసు పార్కు పాలకవర్గం ఎన్నిక ఈనెల 23న జరగాల్సిన నేపథ్యంలో వాయిదా వేశామని ఇన్‌చార్జి మేనేజర్ కుసుమ కుమారి తెలిపారు. నరసాపురం, పాలకొల్లు, మొగల్తూరు, పోడూరు, యలమంచిలి, వీరవాసరం మండలాల్లో మొత్తం 51 సొసైటీలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా ఇప్పటి వరకు 36 సంఘాలకు ఎన్నికలు నిర్వహించామన్నారు. ఇంకా 15 సొసైటీలకు ఎన్నిక ప్రక్రియ జరగలేనందున వాయిదా వేశామన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో చెబుతామని ఆమె తెలిపారు.

విత్తనాల్లో అనుమానాలుంటే అధికారులకు తెలపాలి

నరసాపురం రూరల్, ఆగస్టు 20: ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై రైతులకు అందించిన విత్తనాల్లో ఏమైనా అనుమానాలు ఉంటే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని వ్యవసాయశాఖ ఏడీఈ అనిల్‌కుమారి కోరారు. విత్తనాల్లో రైతులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటే సీడ్స్ సర్టిఫికెట్ పత్రాలు, సంచులు జాగ్రత్త పర్చుకోవాలన్నారు. ప్రతి రైతు తొలుత వంద గింజలు మొలక కట్టుకోవాలని, 80 గింజలు మొలకెత్తితే విత్తనాలు మంచివన్నారు. అంతకంటే తక్కువ ఉంటే రైతులు విత్తనాలు వెనక్కి పంపించాలని కోరారు.

విద్యాదాత అయ్యప్ప నాయుడికి సన్మానం

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 20 :ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికి సహకరించిన దాతలను మరువరాదని స్థానిక వీవర్స్ కాలనీలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్.భవానీప్రసాద్ అన్నారు. మంగళవారం పాఠశాలలో అజాదీకి అమృత్ మహోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అవసరాలకు తగిన వసతులు అందిస్తున్న పారిశ్రామిక వేత్త కామిశెట్టి అయ్యప్ప నాయుడిని ఘనంగా సత్కరించారు. దాత మాట్లాడుతూ మదర్ థెరిస్సా సేవల స్ఫూర్తితో సమాజానికి సేవలందించడం తన సంకల్పం అన్నారు. ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

పెనుగొండ, ఆగస్టు 20 :పశువుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని సిద్ధాంతం సర్పంచ్ చింతపల్లి గనిరాజు అన్నారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం సిద్ధాంతం పశు వైద్య శిబిరంలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్ భానుతేజ మాట్లాడుతూ వచ్చేనెల 18 వరకు టీకాల కార్యక్రమం ఉంటుందని, నాలుగు నెలలు దాటిన ప్రతీ పశువుకు టీకాలు వేయించాలన్నారు. తొలి రోజు సుమారు 150 పాడి పశువులకు టీకాలు వేశామన్నారు. చింతపల్లి జేమ్స్, వెన్నపు వెంకటేశ్వరరావు, తానేటి మదన్ పాల్గొన్నారు.

'పంచాయతీలు ఆదాయ వనరులు పెంచుకోవాలి'

మొగల్తూరు/కాళ్ల/ఆకివీడు, ఆగస్టు 20 :తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి వాటి నుంచి వర్మీ కంపోస్టు తయారు చేసి పంచాయతీలకు ఆదాయవనరులు పెంచుకోవాలని మాస్టర్ ట్రైనీలు, ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. మొగల్తూరు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల రెండో రోజు మంగళవారం రామన్నపాలెం పంచాయతీ పులపర్తివారితోట వర్మీ కంపోస్టు కేంద్రాన్ని పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో బాబ్జిరాజు, ట్రైనీలు కేఎస్ రాజు, వై.కృష్ణ, సాయిరామ్, కార్యదర్శులు గంగన్న, శ్రీనివాస్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కాళ్ల మండలం ఏలూరుపాడు గ్రామంలో డంపింగ్ యార్డు షెడ్ వద్ద సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చెత్త నుంచి సంపద సృష్టించడంపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో జి.స్వాతి, విస్తరణాధికారి ఎంవీ భాస్కరరావు తదితరులు ఉన్నారు. ఆకివీడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కందుల వాణి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు జరిగాయి.

70 మందికి ఉచిత నేత్ర పరీక్షలు

ఆగస్టు, ఆగస్టు 20 : కొడమంచిలి అరుంధతి పేటలో సాల్వేషన్ ఆర్మీ చర్చిలో మంగళవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. రాజమండ్రి సిద్ధార్థ నర్సింగ్ బుద్ధుడు కంటి ఆసుపత్రి సహకారంతో డాక్టర్ టి.ఆనంద్‌కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 70 మందికి కంటి పరీక్షలు చేశామని వైద్యులు తెలిపారు. సర్పంచ్ సుంకర సీతారామ్, పాస్టర్ పి. రత్నం, కొండేటి వర ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

'సకలాభీష్ట ప్రదాయిని శ్రీమహాలక్ష్మీ దేవి'

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 20 : సకలాభీష్టాలను నెరవేర్చేది శ్రీమహాలక్ష్మీ దేవి అని శ్రీలక్షి ని కొలిచిన వారికి కోరికలు నెరవేరుతాయని ఆధ్యాత్మిక వేత్త చాగంటి లింగరాజు అన్నారు. స్థానిక శంకరమఠంలో మంగళవారం రాత్రి టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ధార్మిక కార్యక్రమంలో 'శ్రీలక్ష్మీ వైభవం' అనే అంశంపై ప్రసంగించారు. ఈనెల 23 వరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. తొలుత మహిళలు లలితా సహస్ర పారాయణం, భజన కీర్తనలు ఆలపించారు. సంస్కృత విశ్రాంత అధ్యాపకుడు వీకే సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు సత్తిరాజు కేశవరావు, ఎం.లక్ష్మణకుమార్ భక్తులు పాల్గొన్నారు.

టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు నోటిఫికేషన్

నరసాపురం, ఆగస్టు 20:టీచర్ల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. మండల పరిషత్, తహసీల్దార్, మునిసిపల్, ఎంఈవో కార్యాలయాల్లో నమోదుకు సంబంధించిన ఫాం-19 ఫారాలు పొందవచ్చును. వచ్చే నెల మూడో తేదీ వరకు నమోదు ప్రక్రియ జరగనుంది. ప్రభుత్వ స్కూళ్లలో పని చేసే అసిస్టెంట్లతో పాటు ప్రైవేట్ కాలేజీలు, స్కూళ్ళల్లో మూడేళ్ల సర్వీస్‌తో పాటు డిగ్రీ ఉన్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఓటర్లు నమోదు చేసుకోవచ్చని నరసాపురం తహసీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి


భీమవరంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న శ్రీవిజ్ఞాన వేదిక సభ్యులు

భీమవరం టౌన్/పాలకోడేరు/ఆకివీడు రూరల్/మొగల్తూరు, ఆగస్టు 20 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినప్పుడే దోమలను నివారించవచ్చని ప్రభుత్వ మలేరియా జిల్లా వైద్యుడు కె.రవికుమార్ సూచించారు. భీమవరం పట్టణంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆరోగ్య శాఖ, డీఎంహెచ్‌వో సహకారంతో పీఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా అవగాహన ర్యాలీ సదస్సు, ప్రతిజ్ఞ నిర్వ హించారు. హైస్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, సునీత విద్యార్థులు పాల్గొన్నారు. పాలకోడేరు మండలం గొరగనమూడిలో పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాలక్ష్మి, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీహెచ్ఈవో ప్రభాకరరావు, సూపర్‌వైజర్ నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ రమోల, హెల్త్ అసిస్టెంట్ వేణుప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు. ఆకివీడు రూరల్ గ్రామంమైన సిద్దాపురంలో దోమల నివారణ దినం సందర్భంగా వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మొగల్తూరు మండలం మొగల్తూరులో డాక్టర్ కె.లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.